క్లుప్తంగా

నేడు అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం

పటాన్‌చెరు టౌన్: అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం తెలంగాణ జీవ వైవిధ్య మండలి ఆధ్వర్యంలో పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సాంస్కృతిక తదితర పోటీలను నిర్వహిస్తామని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జీవవైవిధ్య సంరక్షణ ప్రణాళికలో భాగస్వాములం అవుదాం అనే అంశంతో ప్రజలకు అవగాహన కల్పించి సహజ, రసాయన, ప్లాస్టిక్ రహిత ఉత్పత్తులను వినియోగం చేసే విధంగా జీవ వైవిధ్యం విశిష్టతపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ఆర్టీసీ సిబ్బందికి వైద్య పరీక్షలు

నారాయణఖేడ్: ఆర్టీసీ సంస్థ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు గ్రాండ్ హెల్త్ ఛాలెంజ్ రెండో విడతలో భాగంగా నారాయణఖేడ్ ఆర్టీసీ డిపోలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న వైద్య పరీక్షల శిబిరాన్ని మంగళవారం ప్రారంభించారు. మొదటి రోజు వైద్యులు 110 మంది డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లకు, సూపర్‌వైజర్లకు, వివిధ విభాగాల ఉద్యోగులు, సిబ్బందికి 13 రకాల వైద్య పరీక్షలను నిర్వహించారు. మరో రెండు రోజుల పాటు నిర్వహించనున్న శిబిరంలో 100 శాతం ఉద్యోగులు, సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు డీఎం మల్లేశయ్య తెలిపారు.

గ్రామ పంచాయతీ ఏర్పాటు చేయాలని వినతి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని గడ్డపోతారం గ్రామపంచాయతీ నుంచి అల్లినగర్‌ను ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని కోరుతూ స్థానిక నాయకులు ఎంపీడీఓకు మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు వీరేశంగౌడ్, శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేసేందుకు అల్లీనగర్ గ్రామానికి అన్ని అర్హతలు ఉన్నాయన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

ఉపాధిహామీ కూలీల సంఖ్య పెంచండి

మునిపల్లి(అందోల్): ఉపాధిహామీ కూలీల సంఖ్య పెంచాలని ఎంపీడీఓ హరినందన్‌రావు అన్నారు. మండల పరిధిలోని కల్లపల్లి, బేల్లూర్ గ్రామాల్లోని నర్సరీలు, ఉపాధిహామీ పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీలలోని మొక్కలను సంరక్షించేందుకు సమయానికి నీళ్లు పట్టాలని సూచించారు. ఇంకుడు గుంతలు తీసుకున్న లబ్ధిదారుకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం డబ్బులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే తమ పిల్లలను చేర్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పటాన్‌చెరు టౌన్: సబ్‌స్టేషన్ మరమ్మతులో భాగంగా బుధవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పటాన్‌చెరులో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ కిషన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంబేడ్కర్ కాలనీ, జేపీ కాలనీ, ముదిరాజ్ బస్తీ, కుమ్మరి బస్తీ, సాయిరాంనగర్, చైతన్యనగర్, రాఘవేంద్ర కాలనీ, జీహెచ్‌ఎంసీ కార్యాలయ సమీపం, నాయకోటి బస్తీ, రామ్‌మందిర్ రోడ్డు, గోనెమబస్తీ, సారాయి, వెంకటేశ్వరకాలనీ, శ్రీరామ్‌నగర్ కాలనీలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని తెలిపారు.

సదాశివపేటపట్టణంలో...

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని టౌన్ టూ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతు పనులు చేపడుతున్నందునా బుధవారం పట్టణంలో ఫీడర్‌ల పరిధిలో రెండు గంటల పాటు ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ సంతోష్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫయాజ్‌నగర్, రహమత్‌నగర్, గాం. దీచౌక్, పోలీస్‌స్టేషన్, బస్టాండ్, తహసీల్దార్ కార్యాలయం, బసవేశ్వర మందిరం, శాస్త్రీరోడ్, తిలక్‌రోడ్, మహమ్మదీయ నగర్, శంభులింగేశ్వర మందిరం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని తెలిపారు. అదేవిధంగా టౌన్ 3 ఫీడర్ పరిధిలో సాయిబాబా, హనుమాన్‌నగర్, శక్తినగర్, ఏపీహెచ్‌బీ కాలనీ, సిద్ధాపూర్ కాలనీ, ప్రభుత్వ అస్పత్రి, డబుల్ బెడ్రూం పరిధిలో సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

రైతుల రెక్కల కష్టం మిల్లర్ల పాలు

తేమ పేరుతో అదనపు కోత.. లేకుంటే దిగుమతికి నిరాకరణ

- తప్పని పరిస్థితుల్లో తరుగు ఇచ్చేందుకు ఒప్పుకుంటున్న రైతులు
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం



ధాన్యాన్ని మిల్లుకు తరలించేందుకు లారీలో నింపుతున్న దృశ్యం

వట్‌పల్లి(అందోల్): ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకునేందుకు అన్నదాతకు అవస్థలు తప్పడంలేదు. అకాల వర్షాలు రైతులకు అపార నష్టాన్ని కలిగిస్తున్నాయి. వర్షాలకు తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని ప్రభుత్వం చెబుతున్న మాటలు నీటిపై రాతలుగా మారాయి. తేమ పేరుతో కొర్రీలు పెడుతూ అదనంగా ఒక బస్తా చొప్పున తరుగు ఇస్తేనే దిగుమతి చేసుకుంటామని మిల్లర్లు డిమాండ్ చేస్తున్నారు. తరుగు ఇవ్వకుంటే ధాన్యం దిగుమతి చేసుకునేందుకు నిరాకరిస్తుండడంతో రైతులు చేసేదేమి లేక ఓకే చెప్పేస్తున్నారు. మిల్లర్లు ధాన్యంలో అదనపు కోత విధిస్తున్న విషయం అధికారులకు తెలిసినా ఏమాత్రం పట్టించుకోకపోవడంతో ఇదే అదనుగా మిల్లర్లు రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారు.

తేమ సాకుతో..

అకాల వర్షాలతో కొనుగోలు కేంద్రాల వద్ద అరబెట్టిన ధాన్యం తడిసింది. ధాన్యానికి తేమ ఎక్కువగా ఉందని, నూకశాతం పెరుగుతుందని అంటూ కొర్రీలు పెడుతున్నారు. అలాగే.. తరుగు లెక్కలు వేసి బస్తాకు ఇంత తరుగు ఇస్తేనే ధాన్యం దిగుమతి చేసుకుంటామని లేకుంటే ధాన్యం వెనక్కి తీసుకెళ్లాలని కరాఖండిగా చెబుతున్నారు. చేసేదేమిలేక బస్తాకు 3 నుంచి 5 కిలోల అదనంగా కోత విధిస్తున్నారు. ఇప్పటికే కొనుగోలు కేంద్రాల్లో తేమ పేరుతో బస్తాకు 2.5 కిలోల వరకు కోత పడుతోంది.

ధాన్యం తరలింపులో పైసా వసూల్

ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, రైస్ మిల్లర్లు రైతులను తేమ పేరుతో కోత విధిస్తూ నిలువు దోపిడీకి గురిచేస్తుండగా, ఇది చాలదన్నట్టు తూకం వేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు లారీల నిర్వాహకులు ఒక్కో ట్రిప్పుకు రూ.2 వేల నుంచి రూ.4వేల వరకు వసూలు చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. డబ్బులు ఇవ్వకుంటే లారీని వెనక్కి తిప్పుకొని వెళ్తున్నట్లు రైతులు చెబుతున్నారు. దీంతో లారీల సిబ్బందికి డబ్బులు ఇస్తామని నచ్చజెప్పి కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ధాన్యాన్ని తరలిస్తున్నారు. అటు తర్వాత లారీలకు ఇవ్వాల్సిన డబ్బులు వసూలు చేసి రైతులకు కొనుగోలు పత్రం అందజేస్తున్నారు.

ఎక్కడి ధాన్యం అక్కడే...

ధాన్యం తూకం వేసిన ధాన్యాన్ని తరలించేందుకు సరిపడా లారీలు రాకపోవడతో ధాన్యం బస్తాలు కొనుగోలు కేంద్రాల వద్ద ఉంటున్నాయి. దీంతో కొనుగోళ్లు మందకొడిగా సాగుతుండడంతో ధాన్యం కుప్పలు పేరుకు పోయాయి. రైస్ మిల్లులకు తరలించే వరకు రైతులదే బాధ్యత అంటుండడంతో వారికి పడిగాపులు తప్పడం లేదు. టార్పార్ల కిరాయి భారంగా మారుతోందిఃఃఃు మరోవైపు అకాల వర్షాలు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి.

తరుగు ఇస్తేనే ధాన్యం దించుకుండ్రు



ధాన్యం తూకం చేసిన తర్వాత 511 సంచుల ధాన్యాన్ని రైస్‌మిల్లుకు తరలించా. వాహనంలోని సగం ధాన్యం సంచులను ఖాళీ చేసిన తర్వాత తేమ శాతం పేరుతో మిగతా ధాన్యం సంచులను దించకుండా నిలుపుదల చేశారు. తరుగు ఇస్తేనే దిగుమతి చేసుకుంటామని లేకుంటే వెనక్కి తీసుకెళ్లాలని చెప్పారు. పీఏసీఎస్ అధికారిని తీసుకువెళ్లి మిల్లర్లతో మాట్లాడించినా వినకపోవడంతో చేసేదేమి లేక మిల్లర్లు చెప్పినట్లుగానే వినడంతో 13 క్వింటాళ్ల ధాన్యం కోత పెట్టారు. సుమారు రూ.28 వేల వరకు నష్టం జరిగింది.

– వెంకట్‌రెడ్డి, రైతు,కన్‌సాన్‌పల్లి

విచారించి చర్యలు తీసుకుంటాం

మిల్లర్లు ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా ధాన్యంలో కోత విధిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. కన్‌సాన్‌పల్లి పీఏసీఎస్ కొనుగోలు కేంద్రం ద్వారా వెంకట్‌రెడ్డి అనే రైతు ధాన్యంలో 13 క్వింటాళ్ల ధాన్యం కోత చేసినట్లు మా దృష్టికి వచ్చింది. దీనిపై విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం. బాధిత రైతుకు న్యాయం జరిగేలా చూస్తాం.

– వనజాత, డీఎస్‌ఓ, సంగారెడ్డి జిల్లా

కల్లు కోసం వెళ్తే జరిమానా

- పోలీసులు అడ్డుకుంటున్నారు
- కలెక్టర్‌కు రైతుల ఫిర్యాదు
- విస్తుపోయిన క్రాంతి



కలెక్టర్‌తో మాట్లాడుతున్న రైతులు

జోగిపేట(అందోల్): అందోలు శివారులో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించడానికి వెళ్లిన కలెక్టర్ వల్లూరు క్రాంతికి విచిత్ర అనుభవం ఎదురైంది. మంగళవారం కొనుగోలు కేంద్రం వద్ద రైతుల సమస్యలను అడిగి తెలుసుకొని వారి సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ తిరిగి వెళ్తున్న సమయంలో వరి ధాన్యం వద్ద కాపలా ఉండే రైతులంతా ఆమె వద్దకు వచ్చి మేడం మేము సాయంత్రం పూట ప్రతిరోజూ కల్లు తాగడం అలవాటని, రోడ్డు అవతల ఉన్న మా గ్రామానికి వెళ్తున్న సమయంలో పోలీసులు మా వాహనాలను అడ్డుకొని జరిమానాలు విధిస్తున్నారని వాపోయారు. ఫైన్‌లు వేయకుండా పోలీసులకు చెప్పండి మేడమ్ అని రైతులు ప్రాధేయపడ్డారు. ఆశ్చర్యపోయిన కలెక్టర్ మీరు ప్రతిరోజూ బండిపైనే వెళ్తారా? అని ప్రశ్నించారు. ఇంతలో ఎస్‌ఐ అరుణ్‌కుమార్‌గౌడ్ కల్పించుకొని జాతీయ రహదారి కావడంతో రోజుకో యాక్సిడెంట్ జరుగుతుందని కలెక్టర్‌కు వివరించారు. మనం హెల్మెట్ పెట్టుకుంటే మనకే మంచిది కదా అని ఆర్డీఓ, తహసీల్దార్లు రైతులకు నచ్చజెప్పారు.

హరీశ్‌రావును కలిసిన నాయకులు



మాజీ మంత్రి హరీశ్‌రావుతో బీఆర్‌ఎస్ నాయకులు

మునిపల్లి(అందోల్): బీఆర్‌ఎస్ యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయి కుమార్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో మాజీ మంత్రి హరీశ్‌రావును మంగళవారం క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పటిష్టతకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని హరీశ్‌రావు సూచించినట్లు తెలిపారు. హరీశ్‌రావును కలిసినవారిలో పెద్దలోడి మాజీ ఎంపీటీసీ వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో...

జిన్నారం(పటాన్‌చెరు): మండలం పరిధిలోని బొల్లారం మున్సిపల్ బీఆర్‌ఎస్ నాయకులు బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో మాజీ మంత్రి హరీశ్‌రావును మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గత ఎంపీ ఎన్నికల తీరుపై చర్చించినట్లు బాల్‌రెడ్డి తెలిపారు.

మహిళ అదృశ్యం

మునిపల్లి(అందోల్): మహిళ అదృశ్యమైన ఘటన చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..మునిపల్లి మండల కేంద్రానికి చెందిన చెరువుల అనుసుజ గత శనివారం వ్యవసాయ బావి వద్దకు వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. దీంతో ఆమె కుటుంబసభ్యులు నాటి నుంచి ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆచూకీ తెలిసిన వారు బుదేరా పోలీస్‌స్టేషన్ 8712656749 సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచించారు.



చెత్తాచెదారాన్ని తొలగిస్తున్న విద్యార్థులు

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత

కొండాపూర్(సంగారెడ్డి): పరిసరాల శుభ్రత అందరి బాధ్యత అని ప్రిన్సిపాల్ డాక్టర్ రత్నప్రసాద్ అన్నారు. సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్, అర్థశాస్త్ర విభాగ ఆధ్వర్యంలో మంగళవారం స్వచ్ఛభారత్ నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తూ అమలు పరుస్తున్న కార్యక్రమాల్లో స్వచ్ఛభారత్ ఒకటని, ఈ కార్యక్రమం ద్వారా పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం కళాశాలలో గ్రీన్ లైబ్రరీ, బొటానికల్ గార్డెన్, పరిసర ప్రాంతాల్లో చెత్తాచెదారాన్ని తొలగించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు డాక్టర్లు జగదీశ్వర్, సిద్ధులు, అభిజిత్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా బ్రహ్మోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి చందనోత్సవం, ధ్వజారోహణ, జ్వాలా లక్ష్మీనరసింహ స్వామి హోమం, లక్ష తులసి పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు భార్గవ లక్ష్మీనరసింహస్వామి మాట్లాడుతూ ఈ నెల 25వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాలకు భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించాలని సూచించారు.



కాల భైరవస్వామికి పూజలు

జహీరాబాద్: పట్టణంలోని సిద్ధేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న కాలభైరవస్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బహుళ అష్టమిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

రేపు గురుకులం ప్రవేశానికి స్పాట్ కౌన్సెలింగ్

కంగ్టి(నారాయణఖేడ్): తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో బ్యాక్‌లాగ్ సీట్లలో ప్రవేశానికి గాను రేపు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు కంగ్టి కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రాయ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పదో తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులు కంగ్టిలో హెచ్‌ఈసీ, సీఈసీ కోర్సుల్లో ప్రవేశానికి హైదరాబాద్‌లోని ప్రాంతీయ సమన్వయ అధికారి కార్యాలయంలో ఈ నెల 23న ఉదయం 10.30 గంటలకు నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని ప్రాంతీయ సమన్వయ అధికారిణి కల్యాణి ఆదేశాలు జారీ చేసినట్లు శ్రీనివాస్ రాయ్ తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు సంబంధిత సర్టిఫికెట్లతో సకాలంలో హాజరుకావాలని, సందేహాలకు 9849328298 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

అదుపు తప్పి ఆటో బోల్తా

మహిళకు తీవ్ర గాయాలు

నారాయణఖేడ్: ఆటో అదుపు తప్పి బోల్తా పడిన ఘటన మండల పరిధిలోని జుజాల్‌పూర్ వద్ద మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మనూరు మండల పరిధిలోని ఎల్గోయి నుంచి నారాయణఖేడ్‌కు ప్రయాణికులతో ఆటో బయలుదేరింది. ఈ క్రమంలో జుజాల్‌పూర్ శివారులోకి రాగానే ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న ఎల్గోయికి చెందిన మహిళ బూతపిల్లి యాదమ్మ తీవ్రంగా గాయపడగా మరో ముగ్గురికి స్వల్పంగా గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఖేడ్ ప్రాంతీయ ఆస్పత్రికి తరలించగా అక్కడవారు చికిత్స పొందుతున్నారు.

రాజీవ్‌గాంధీ సేవలు మరువలేనివి

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు



పటాన్‌చెరు: రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నీలం మధు

పటాన్‌చెరు: రాజీవ్‌గాంధీ సేవలు మరువలేనివని మెదక్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ అన్నారు. మండల పరిధిలోని చిటుకుల్‌లో రాజీవ్‌గాంధీ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నీలం మధు మాట్లాడుతూ దేశానికి సాంకేతికతను తీసుకువచ్చి టెక్నాలజీ విప్లవంలో భారత్‌ను మంచి పేరును తీసుకువచ్చారని కొనియాడారు. అభివృద్ధి చెందుతున్న దేశాల సరసన భారతదేశాన్ని నిలిపిన ఘనత రాజీవ్‌గాంధీకే దక్కుతుందని వివరించారు.

ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఆధ్వర్యంలో...

నారాయణఖేడ్: భారతరత్న మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతిని ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సూచించారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ దారం శంకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు భోజిరెడ్డి, ముఖ్య నాయకులు రమేష్‌చౌహన్, పండరిరెడ్డి, శంకర్ ముదిరాజ్, ఈశ్వరప్ప, రాజుసేట్ పాల్గొన్నారు.



నారాయణఖేడ్‌లో..



జహీరాబాద్‌లో..

జహీరాబాద్ పట్టణంలో...

జహీరాబాద్: పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజీవ్‌గాంధీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ ప్రధానిగా దేశానికి అందించిన సేవలను కొనియాడారు. నాయకులు మంకాల్ సుభాష్, కండెం నర్సింహులు, కిషన్‌రావు పవార్, నర్సింహారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, అరుణ్‌కుమార్, జహంగీర్, రమేష్‌బాబు, యూనూస్, శేఖర్, ఇనాయత్ పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో...

పటాన్‌చెరు టౌన్: దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతిని పటాన్‌చెరు పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి మాట్లాడుతూ.. పంచాయతీరాజ్ చట్టాన్ని తీసుకొచ్చి ప్రధానికి లేనటువంటి చెక్ పవర్‌ను సర్పంచ్‌లకు కల్పించిన ఘనత రాజీవ్‌గాంధీకే దక్కిందని వివరించారు. కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి సామయ్య, మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆతిక్, యువరాజ్, అబ్దుల్లా, పాషా, ఫయజ్, సాయి ముదిరాజ్, కిషన్, పాండు ముదిరాజ్, జ్యోతి, అనసూయ పాల్గొన్నారు.



పటాన్‌చెరు టౌన్‌లో..

మునిపల్లి మండలంలో...

మునిపల్లి(అందోల్): దివంగత మాజీ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ వర్ధంతి మంజీర రైతు రాష్ట్ర అధ్యక్షుడు పృథ్వీరాజ్ ఆధ్వర్యంలో మల్లారెడ్డిపేటలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు మాధవరెడ్డి, ఉపాధ్యక్షులు మొగులయ్య, సురేష్, పాల్గొన్నారు.

దుర్గమ్మ ఆలయం ముస్తాబు

నారాయణఖేడ్: నిజాంపేట్ మండల కేంద్రంలోని దుర్గామాత ఆలయం వార్షికోత్సవ వేడుకలకు ముస్తాబు చేసినట్లు ఉత్సవ నిర్వాహకులు మంగళవారం తెలిపారు. ఈ నెల 22న బుధవారం ప్రత్యేక పూజలు, అభిషేకం, అలంకరణ, బండ్ల ప్రదర్శన ఉంటుందన్నారు. 23న గురువారం వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు, రథోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. 24న శుక్రవారం ప్రత్యేక పూజలతో పాటు మధ్యాహ్నం నుంచి కుస్తీపోటీలు ఉంటాయని తాజా మాజీ సర్పంచ్ జగదీశ్వరాచారి సూచించారు.

ఆర్థికసాయం అందజేత

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని బొల్లారం మున్సిపల్ పరిధిలో ఇటీవల భవన నిర్మాణ కార్మికుడు దీపాంకర్‌దాస్ వ్యక్తి కాలు విరిగిన విషయం తెలిసిందే. ప్రస్తుతం దీపాంకర్‌దాస్ ఈఎస్‌ఐ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో దీపాంకర్‌దాసు పరిస్థితి విషమించడంతో వైద్యులు కాలు తీసేశారు. విషయం తెలుసుకున్న బొల్లారం బీజేపీ పట్టణ అధ్యక్షుడు కేజేఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి మంగళవారం బాధితుడిని పరామర్శించి రూ.20 వేలను ఆర్థికసాయంగా అందజేశారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



పూడికతీత పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ హరికృష్ణ

ఎంపీపీ కల్లూరి హరికృష్ణ

శివ్వంపేట(నర్సాపూర్): స్వచ్ఛంద సంస్థలు రైతుల కోసం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కల్లూరి హరికృష్ణ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని చిన్నగొట్టిముక్లలోని పటేల్ చెరువులో సెగల్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నీటి సంరక్షణ పథకం ద్వారా పొలాలకు మట్టి తరలింపు పనులను ఎంపీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెరువు మట్టిని పొలాలకు తరలించడం ద్వారా సాగు దిగుబడి పెరుగుతుందన్నారు. సంస్థ ద్వారా రైతులు విత్తనాలు, పనిముట్లను ఇవ్వడంతో రైతులు ఆర్థిక అభివృద్ధికి దోహదం పడుతుందన్నారు. సెగల్ సంస్థ కో ఆర్డినేటర్ వేమనారాయణ మాట్లాడుతూ.. చెరువు పూడిక తీయడంతో పాటు కట్ట వెడల్పు పనులు చేయడం జరుగుతుందన్నారు. మట్టి తవ్వకానికి సంస్థ జేసీబీ ఏర్పాటు చేస్తుందని, రైతులు ట్రాకర్లు సమకూర్చుకుని మట్టిని పొలాలకు తీసుకెళ్లాల్సి ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ దశరథ్, రైతులు నారాయణరావు, నర్సింగరావు, నరేందర్, భిక్షపతిరావు, హర్షనాయక్, పాపయ్యచారి, శంకర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.